# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## ఎస్పీడబ్ల్యూలో ఘనంగా హర్ గర్ తిరంగా.

తిరుపతి విద్య ఆగస్టు 13 ప్రభాత వార్త:



పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఫిజిక్స్ విభాగం, స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సుమారు వెయ్యి మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని 2 వేల మంది విద్యార్థినులు, అధ్యాపక బృందం జాతీయ సమైక్యతను పెంపొందించే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థినులలో దేశభక్తిని పెంపొందించడానికి ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారఈ కార్యక్రమంలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్ నెహ్రూ, అధ్యాపకులు ఉమారాణి, సునీత, వసుధ, జయశ్రీ, లక్ష్మీ సంధ్య, ఉమామహేశ్వరి, రాధాకృష్ణ, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## 79వ స్వాతంత్ర్యదినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల, ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:



ధార్మికసంస్థ టిటిడిలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలను రేపు శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. వివిధ విభాగాలకు చెందిన అంకితభావసేవలకు వెండిడాలర్, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. టిటిడి సెక్యూరిటీ సిబ్బంది రిహార్సల్స్ చేపట్టారు.

## 16న కృష్ణాష్టమి

### -17న ఉట్లోత్సవం



తిరుమల, ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను టిటిడి తిరుమల, తిరుపతిలో ఘనంగా నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అష్టమితిథిన ఈ పర్వదినం జరుగుతుంది. సాక్షాత్తు ద్వాపరయుగంలో శ్రీకృష్ణపరమాత్ముడే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించారని పురాణాల కథనం. ఈ నేపథ్యంలో కృష్ణాష్టమిని అత్యంత వేడుకగా జరిపిస్తారు. ఈనెల 16వతేదీ శనివారం ఉదయం కృష్ణాష్టమి ఆస్థానం జరుగుతుంది. బంగారువాకిలిలోని ముఖమండపంలో రాత్రి 8గంటల నుండి గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని, ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు కృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం జరిపిస్తారు,. ఆ తరువాత 17వతేదీ ఆదివారం ఉదయం గోగర్భమ్డ్యామ్ ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి ఉద్యానవనవిభాగం ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు చేస్తారు. ప్రసాద నివేదిన జరుగుతుంది. స్థానిక యువకులు ఉట్టి కొట్టడం పరిపాటి. తిరుమల స్థానికులు అన్నదానం చేస్తారు. ఆ తరువాత శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి ఆలయం ముందుకు వచ్చి అక్కడ ఏర్పాటుచేసిన ఉట్లోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఉట్లనుయువత ఉత్సాహంగా కొట్టడాన్ని స్వామివారు స్వయంగా పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా 17వతేదీ ఆలయంలో జరిగే పలు సేవలు రద్దయ్యాయి.

## ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు

### - బ్రహ్మోత్సవాలు పూర్తయిన అనంతరం కాణిపాకం దేవస్థానం పాలకవర్గం
### - త్వరలో అర్ధగిరి పుణ్యక్షేత్రానికి కమిటీ ఏర్పాటు



చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:

పూతలపట్టు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు అధికార పార్టీ నేతలను ఊరిస్తున్నాయి. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ఏడాదికి పైగా కావడంతో నామినేటెడ్ పదవులపై అధికార పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ నామినేటెడ్ పదవుల భర్తీకి పేర్లను ఎంపిక చేసి పంపినప్పటికీ నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం జరుగుతోంది. బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఇటీవల ఏర్పాటు అయ్యింది. తవణంపల్లి మండలానికి చెందిన భాస్కర్‌నాయుడు బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా, అలాగే డైరెక్టర్లుగా నియోజకర్గ పరిధిలోని మండలాల నుండి ఇద్దరిద్దరిని నియమించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటు కావాల్సి వుంది. గత ప్రభుత్వం చివరి కాలంలో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పాలకవర్గానికి పదవికాలం పూర్తి కఆవడంతో పునరుద్దరించలేదు. దీంతో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి పాలకవర్గం ఏర్పాటు అవుతుందని అందరు భావించారు. ఈ మేరకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ సైతం ఆలయ పాలకవర్గం ఏర్పాటుపై నియోజకవర్గ నాయకులతో కసరత్తు చేసి పేర్లు సిద్ధం చేశారు. ఈ మేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఛైర్మన్‌గా మణినాయుడు నియమితులు అయ్యే అవకాశం వుంది. అలాగే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పాలకవర్గ సభ్యులుగా పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాలకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులను ఎంపిక చేసి ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ జాబితా సమర్పించినట్లు తెలిసింది. అయితే ఈ జాబితా ఇప్పటి వరకు ఖరారు కాలేదు. ప్రస్తుతం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం కన్పించడం లేదు. అలాగే తవణంపల్లి మండలంలోని అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయానికి పాలకవర్గం ఏర్పాటు చేయడానికి సైతం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్లు ఖరారు చేసి పంపారు. ఈ ఆలయ పాలకవర్గం మాత్రం త్వరలో ఖరారు అయ్యే అవకాశం కన్పిస్తోంది. అలాగే బంగారుపాళ్యం మండలంలోని శ్రీ మొగిలీశ్వర ఆలయానికి పాలకవర్గం నియమించాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచించి ఈ మేరకు పేర్లను సిద్ధం చేసింది. అయితే శ్రీ మొగిలీశ్వర ఆలయంకు వంశపారంపర్య ధర్మకర్త వుండటంతో ఈ ఆలయానికి పాలకవర్గం ప్రకటించే అవకాశం లేదని తెలిసింది. శ్రీమొగిలీశ్వర దేవస్థానం పాలకవర్గ సభ్యులుగా ఎంపిక చేసి పంపిన వారు ఈ నిర్ణయంతో నిరాశ చెందే అవకాశం కన్పిస్తోంది. అలాగే నియోజకవర్గ పరిధిలో దేవాదాయ శాఖకు చెందిన పలు చిన్న ఆలయాలు వున్నాయి. ఈ ఆలయాలకు పాలకవర్గాలు నియమితులైతే స్థానికంగా తమకు కొంత పలుకుబడి వస్తుందని ఆశించిన గ్రామ స్థాయిలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానికంగా వున్న ఆలయాల్లో తమను పాలకవర్గ సభ్యులుగా నియమించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సైతం స్థానిక అధికార పార్టీ నేతలతో చర్చించి కొంతమంది నాయకులు పేర్లను పలు ఆలయాలకు ఛైర్మన్, డైరెక్టర్లుగా ఎంపిక చేసి జాబితా సమర్పించారు. అలాగే నియోజకవర్గ పరిధిలో వున్న సింగిల్‌విండోలకు ఒక పర్సన్ ఇన్‌ఛార్జితో పాటు ఇద్దరు సభ్యులను నామినేట్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఐదు సింగిల్ విండోలకు స్థానిక నాయకులతో చర్చించి ఎమ్మెల్యే పర్సన్ ఇన్‌ఛార్జి, ఇద్దరు సభ్యులను ఎంపిక చేసి నియమించారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో వున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తయితే క్షేత్ర స్థాయిలో పార్టీకి మరింత ఊపు వుంటుందని పార్టీకి చెందిన నాయకులు భావిస్తున్నారు. అయితే ఈ నామినేటెడ్ పదవుల భర్తీకి ముహూర్తం ఎప్పుడు ఖరారు అవుతుందోనని జాబితాలో అధిష్టానానికి పేర్లు వెళ్ళిన వారు ఆశతో ఎదురుచూస్తున్నారు.

## డ్రగ్ ఫ్రీ చిత్తూరు దిశగా అడుగులు

### - హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:

యువత మత్తు పదర్థాఆలు, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా డ్రగ్ ఫ్రీ చిత్తూరు దిశగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రం చిత్తూరు గాంధ్రీ విగ్రహం కూడలిలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం కూడలి నుండి ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా నాగయ్య కళాక్షేత్రం చేరుకుని తిరిగి గాంధీ విగ్రహం కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనల మేరకు ప్రతి ఊరిలో, ప్రతి జిల్లాలో, రాష్ట్ర స్థాయిలో, దేశ స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రెండు వారాల పాటు నిర్వహించుకోవాలని తెలిపియున్నారన్నారు. ఈ వేడుకల్లో జాతీయ జెండాను పట్టుకుని తిరగడమే కాకుండా దేశభక్తిని చాటాలని, మన పరిసరాలు, మన నగరంను శుభ్రంగా వుంచుకోవడం మన బాధ్యత అన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో 2 వేల మందికి పైగా విద్యార్థులు మువ్వెన్నల జెండాతో ర్యాలీ నిర్వహించామన్నారు. సమాజంలో డ్రగ్స్ వాడకం పెరిగిందని, సమాజానికి ప్రమాదకరంగా మారిందన్నారు. యువత మేల్కొని డ్రగ్స్‌కు దూరంగా వుండాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనపై నిఘా వుంచాలన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగి వుండటం తమ విధిగా భావించి మత్తు పదార్థాల రవాణా, అమ్మకం, వాడకం తదితరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరేలా ప్రజలు బాధ్యతగా నడుచుకోవాలన్నారు. యువత మత్తు పదర్థాలకు బానిస కాకూడదన్నారు. చిత్తూరు నియోజకవర్గంను డ్రగ్ ఫ్రీ చిత్తూరుగా మార్చడానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చిత్తూరులో మత్తు పదర్థాలు, మాదక ద్రవ్యాలను కట్టడి చేయడానికి కలెక్టర్, ఎస్పీలతో పాటు తాను కృషి చేస్తానన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా శుక్రవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంను లాంఛనంగా ప్రారంభించనున్నామన్నారు. మేయర్ అముద, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్తూరులో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద తదితరులు.

## కుప్పంలో నామినేటెడ్ పదవుల జాతర

### రెస్కో ఛైర్మన్‌గా ప్రతాప్‌కుమార్.. ఎంసి ఛైర్మన్‌గా జిఎం రాజు.. ఏరియాఆస్పత్రివైస్‌ఛైర్మన్‌గా భాగ్యలక్ష్మిత్రిలోక్

కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల జాతర ఒక్కసారిగా వచ్చేసింది. శ్రేణులు ఆనందభరితమయ్యారు. కుప ్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) ఛైర్మన్‌గా కమతమూరు మాజీ సర్పంచ్ విజి ప్రతాప్‌కుమార్ ఎంపికయ్యారు. అలాగే కుప్పం ఎఎంసి ఛైర్మన్‌గా గుడుపల్లె మాజీ ఎంపిపి జిఎం రాజు ఎంపికయ్యారు. కుప్పం ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్‌గా నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్ డిఎస్ త్రిలోక్ సతీమణి భాగ్యలక్ష్మి త్రిలోక్ ఎంపికయ్యారు. వీరితో పాటు ఆయా పాలకవర్గాల సభ్యుల పేర్లు సైతం ఖరారయ్యాయి. కుప్పం రెస్కో వైస్ ఛైర్మన్‌గా విశ్వనాథ్, సభ్యులుగా ఆర్ముగం, పి.శివ, తులసినాథ్ (బిజెపి), మురళి, హరోహరన్, అనసూయ, బసవరాజు, శరణ్‌కుమార్, మునివెంకటప్ప, బాలగంగాధర్, అమీర్ బాషా (జనసేన), విజయ్‌కుమార్, పి.సతీష్‌లు ఎంపికయ్యారు. అలాగే మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ప్రియ శరవణ, డైరెక్టర్లుగా మునేంద్ర నాయక్, గోపి, వల్లెప్ప, తులసిబాబు, కళావతిఉదయ్‌కుమార్, చంద్రకళ, సుకన్య, అస్మ, అనిత, శ్యామలమణి, భానుమూర్తి, పవన్‌కుమార్, వడివేలు (బిజెపి)ల ఎంపికయ్యారు. కుప్పం ఏరియా ఆస్పత్రి డైరెక్టర్లుగా రేఖ, విజయ్‌కుమార్‌రెడ్డి, డా॥ ప్రశాంత్, విజి.కాశీనాథ్ (బిజెపి), మంజునాథ్‌గౌడ్‌లు ఎంపికయ్యారు.

## పికెఎం ఉడా ఛైర్మన్‌గా డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త



పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పికెఎం ఉడా)నూతన ఛైర్మన్‌గా కుప్పంకు చెందిన తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడతాయి. గతంలో ఉమ్మడి ఎపి జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (ఎపిజూడా) అధ్యక్షుడిగా డా॥ బిఆర్ సురేష్‌బాబు పనిచేశారు. కుప్పం మాజీ ఎమ్మెల్యే దివంగత బిఆర్ దొరస్వామినాయుడు తనయుడు అయిన డా॥ బిఆర్ సురేష్‌బాబు సిఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటినుంచి ఆయన పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కుప్పం ప్రాంతంలో మంచి వైద్యుడిగా పేరుతెచ్చుకున్న డా॥ బిఆర్ సురేష్‌బాబుకు 'పేదల డాక్టర్' అనే పేరు సైతం ఉంది. ఆయన పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన సిఎం చంద్రబాబునాయుడు కీలకమైన పికెఎం ఉడా ఛైర్మన్ పదవికి ఎంపిక చేశారు.



## ధర్మకర్తల మండలిలో 13మందికి చోటు

*చౌడేపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త*

*శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలిలో 13మందికి చోటు కల్పిస్తూ దేవాదాయధర్మాదాయశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఇటీవల ఆలయ నూతన కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అయిన విషయం విధితమే. కాగా మండలిలో ఎంతమంది వుండాలి, సామాజిక వర్గాల మార్గదర్శకాలను వెలువరించారు. ధర్మకర్తల మండలిలోని 13మందిలో 6గురు ఏ సామాజిక వర్గాని చెందినవారైనా వుండాలన్నారు. 6గురు ఇతరుల్లో ఒకరు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారుగా వుండాలనీ, తక్కిన 7గురిలో ఇద్దరు ఎస్సీ, ఎస్టీలు, 5గురు బిసిలు వారిలో ఒకరు నాయీబ్రాహ్మణుడికి చోటు కల్పించాలన్నారు. దేవస్థానంలోని ప్రధాన అర్చకుడు ఎక్స్అఫిషియో సభ్యుడుగా వ్యవహరిస్తారన్నారు. అభ్యర్థులు హిందువులయి వుండి మంచి ప్రవర్తన, నడవడిక కల్గి వుండాలన్నారు. ధర్మకర్తల మండలి యందు ఒక డోనర్‌ను సభ్యుడుగా నియమించుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జైలు శిక్ష అనుభవించినవారు క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలు, సురా పానీయాలు మత్తు పదార్థాలు సేవించేవారు అనర్హులన్నారు.*

## అక్రమ క్వారీల ఆగడాలు అరికట్టండి

### - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి

సత్యవేడు, ఆగస్టు 13 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో పీవీ పురం పంచాయతీ చమర్తకండ్రిగ గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కారణంగా దళితులు, గిరిజనులు తమ భూములు కోల్పోతుండగా, దేవాలయ భూములు, శ్మశనాలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నిరాజు, సీపీఎం నాయకులతో కలసి మైనింగ్ ప్రాంతాన్ని ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ వల్ల కాలుష్యం పెరిగి స్థానికుల ఆరోగ్యం దెబ్బతింటుందని, అనేకులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని క్వారీలను సీజ్ చేసి స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భూములను మళ్లీ వ్యవసాయానికి అనుకూలంగా మార్చాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతాయని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నిరాజు, సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జనార్ధన్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, యువజన విద్యార్థి సంఘం నాయకులు చంద్ర మురళి, నాగార్జున, గిరిజన సమైక్య నాయకులు సుధాకర్, శీను, ధనంజయలు, ఓబుల్‌రాజు, దళిత సంఘం నాయకులు నరేష్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆడికృత్తికకు షణ్ముఖ స్వామి ఆలయం సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఆగస్టు 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పరిసరాల్లో తమిళ సంప్రదాయాలు చాలా వరకు ఆచరించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఆడికృత్తికను తమిళనాడుతో పాటు నిర్వహించటం ఆనవాయితి. 1990 వరకు ఆడికృత్తికకు శ్రీకాళహస్తి నుంచి వేలాది మంది ప్రైవేటు బస్సుల్లో తిరుత్థణి వెళ్ళేవారు. ఆ తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగావెలసిన కుమారస్వామి కొండ(విజ్ఞానగిరి)పైవెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో భారీ ఎత్తున నిర్వహించే సంప్రదాయం అమలులోకి వచ్చింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి ఆలయంలో ఆడినెలలో బ్రహ్మోత్సవాలుగాను, కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్సవాలుగాను నిర్వహించటం మొదలు పెట్టారు. దాంతో ఇక్కడ నుంచి తిరుత్తణి వెళ్ళే భక్తుల సంఖ్య క్రమంగా తగ్గింది. కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రతి ఏడాది తిరుత్తణిలో ఉత్సవాలతో పాటు ఇక్కడ కూడా నిర్వ హించేవారు. కానీ ఈ ఏడాది ఎందుకో దేవస్థానం అందరు నడిచిన దారి మనమెందుకు వెళ్లాలనుకుందో ఏమో? కానీ తమిళనాడు కన్నా ఒక నెల ముందుగానే ఆడికృత్తిక మహోత్సవాలకు ముహూర్తం ఖరారు చేసి నిర్వహించారు. అయితే అప్పటిలో జనం నుంచి దేవస్థానంకు వ్యతిరేకత వ్యక్తమైనా పోస్టర్లు ముద్రించారు. వాటిని ఎంఎల్ఏ ద్వారా ఆవిష్కరింపజేసారు. ఊరంతా పంచేసారు అంటూ జనం వ్యతిరేకతతో మాకేంటి సంబంధం అంటూ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు, మహోత్సవాలను నిర్వహించేసారు. ఇందుకు లక్షల రూపాయలు వెచ్చించేసారు.

**మరి ఇప్పుడు ఏం చేస్తారు?**

ఆడినెలలో తిరుత్తణిలో నిర్వహించే ఆడికృత్తిక మహోత్సవాలు ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్నారు. 16వతేది ఆడికృత్తిక అంటూ తమిళనాడులోని తిరుత్తణి దేవస్థానం ప్రకటించింది. అంతేకాక పొరుగున ఉన్న గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా కావళ్ళలో వెళుతున్నారు. ఈ నెల 16న ఆడికృత్తిక అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. మరి శ్రీకాళహస్తి దేవస్థానం ఏమో? ఒక నెల ముందుగానే ఉత్సవాలు జరిపేసి చేతులు దులుపుకున్నారు. మరి భక్తుల మనోభావాలకు సంబంధించి ఏం సమాధానం చెబుతారు? కాగా పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో ఆడికృత్తిక రోజు పూజలకు సిద్దం చేస్తున్నారు. భక్తులు కూడా తమిళనాడు నిర్ణయాన్నే ప్రామాణికంగా తీసుకొని ఉత్సవాలు జరుపుకుంటారు.

**వేదిక్ కమిటి నిర్ణయం అంటూ దేవస్థానం చేతులు దులుపుకుంది:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన కుమా రస్వామి కొండపై గత నెల ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహణ నిర్ణయం ప్రభుత్వం నియమించిన 'వేదిక్ కమిటి' నిర్ణయం అంటూ, దానికి ఆలయానికి చెందిన మిరాశిదారుల కుటుంబాల్లో ఒకరైన అర్చకుల ధృవీకరణ అంటూ దేవస్థానం సమర్థించుకుంటున్నారు. వేదిక్ కమి టిలో సభ్యులు ఎలా ఆడికృత్తిక నిర్వహణకు నిర్ణయించిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఈ వివాదాలకు సంబంధించి ప్రధానార్చకులు సంబంధం గురుకుల్‌ను వివరణ కోరగా తాను వైదిక్ కమిటిలో సభ్యుడేనని అయితే తాము ఎలాంటి నిర్ణయం తేదీలు ఖరారు చేయలేదని స్పష్టం చేసారు. ఆలయ ప్రధానార్చకులుగా తనను ఎవ్వరూ అడగలేదని స్పష్టం చేసారు. ఇక వివాదాలకు సంబంధించి వివరణ ఇస్తూ రెండుసార్లు నిర్వహించే సందర్భాలు 8 సంవత్సరాల కొక మారు వస్తుందన్నారు. మిరాశి దారుల తరఫున ఉన్న గురుకుల్ నిర్ణయం మేరకు కమిషనర్ కార్యాలయానికి పంపి అనుమతి తీసుకున్నట్లు తనకూ తెలిసిందన్నారు. ఆడికృత్తికబ్రహ్మోత్సవాలు కాదని కేవలం సుబ్రమణ్యంస్వామి కళ్యాణమే ప్రధానమని వివరణ ఇచ్చారు.

# పారదర్శకంగా సంఘాల లెక్కలు

**- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి**

చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:

స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా వుండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో బుధవారం డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి డిఆర్‌డిఎ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక కార్యకలాపాలు ఇకపై సాంకేతికపరంగా కొనసాగాలని, దీనికి క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాల్లోని సంఘ సభ్యులను కలిసి ఆ దిశగా వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సాంకేతికతను అందిపుచ్చుకుంటే సంఘ సభ్యులకు పలు ప్రయోజనాలు వుంటాయని, సంఘాల కార్యకలాపాలు పారదర్శకంగా కొనసాగుతాయన్నారు. జిల్లాలో



డిఆర్‌డిఎ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పిడి శ్రీదేవి.

ప్రయోగాత్మకంగా యాదమరి, తవణంపల్లి మండలాల్లో ఎంపిక చేసిన విఓల్లో తొలి విడతగా ఈ నారి యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా సంబంధిత సంఘ సభ్యులకు సంబంధించిన అన్ని ఆర్థిక వ్యవహారాలను యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. తద్వారా సంఘ సభ్యులకు తమ సంఘంలోని ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి సమగ్ర వివరాలను నేరుగా తెలుసుకునే అవకాశం వుంటుందన్నారు. ఇప్పటికే మొబైల్ బుకింగ్ విధానం కొనసాగుతున్న నేపథ్యంలో సంఘ సభ్యులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో సంఘ పరిధిలోని అన్ని కార్యక్రమాలు టెక్నాలజీతో అనుసంధానం కానున్న నేపథ్యంలో సిబ్బంది సైతం వీటిపై పూర్తి పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిపిఎంలు సునీత, రవికుమార్, ఎపిఎలు మధు, సుబ్బారెడ్డిలు, సిసిలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కె.పట్నం సచివాలయంను సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్



తవణంపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త:

తవణంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కె.పట్నం గ్రామ సచివాలయంను జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో మీటర్నల్ ఫీల్డ్ హెల్త్, హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి రికార్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనూష, డిఎస్‌ఓ ప్రసాద్, డిపిఓ రామ్మోహన్, మండల వైద్యాధికారులు డాక్టర్ పి.ప్రియాంక, డాక్టర్ టిఎస్ మోహన్‌వేలు, డిహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పిహెచ్‌ఎన్ దేవకళ, హెల్త్ సూపర్‌వైజర్లు గోపి, నిర్మలమ్మ, టి.సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో అధ్యక్షుల ప్రమాణస్వీకారం

పలమనేరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

పలమనేరు, పలమనేరు రూరల్ మండలం బయప్పగారిపల్లె, బైరెడ్డిపల్లె సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు, బైరెడ్డిపల్లె సింగిల్‌విండో కార్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. పలమనేరు సింగిల్ విండో అధ్యక్షుడుగా వెంకటరమణ (పెద్దబ్బ), బయప్పగారిపల్లె పింగిల్ విండో అధ్యక్షుడుగా వెంకటమునిరెడ్డి, డైరెక్టర్లచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే బైరెడ్డిపల్లె సింగిల్ విండో అధ్యక్షుడుగా జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్లచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన సింగిల్ విండో పాలకవర్గాలు రైతు సంక్షేమం కోసం కృషిచేయాలన్నారు. సింగిల్ విండో రుణాలు, ఎరువులు, పురుగుల మందుల సరఫరాల వంటి కార్యక్రమాలపై శ్రద్ధ చూపాలని కోరారు. బాలాజీ కో ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బలాజీ పలమనేరు తెలుగుదేశం నాయకులు, సింగిల్ విండో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలమనేరులో హర్‌ఘర్ తిరంగా..

పలమనేరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

పలమనేరులో మున్సిపల్ కమీషనర్ వెంటరమణారెడ్డి అధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా ఈ కార్యక్రమం చేపట్టారు. అధికసంఖ్యలో డ్వాక్రా మహిళలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పార్టీల కతీతంగా ప్రజలు జాతీయ జెండాలు చేపబట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. వందే మాతరం, బోలో భారత్‌మాతాకీ, జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు.

## కష్టపడే కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త:




తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అగ్రతాంబూలం ఇవ్వడంతో పాటు కష్టపడే కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ తెలిపారు. బుధవారం రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన సిఎంటి త్యాగరాజులు తన మద్దతుదారులతో కలసి ర్యాలీగా బివిరెడ్డి కాలనీలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువతో సత్కరించారు. పార్టీ ఉన్నతికి, మొదలియార్ల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని ఎమ్మెల్యేకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నళిని, మొదలియార్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై విద్యార్థుల మల విసర్జన

పూతలపట్టు, ఆగస్టు 13, ప్రభాతవార్త

మండలంలోని పి. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ రహదారికి నాలుగు అడుగుల దూరంలో ఉండడంతో నిత్యం విద్యార్థులు వాహనాల రద్దీ దృష్ట్యా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకపోతే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రభుత్వ ధనంతో లక్షల పోసి నిర్మించినటువంటి మరుగుదొడ్ల భవనము స్థానిక శాసనసభ్యులచే ప్రారంభోత్సవం చేసినప్పటికీ విద్యార్థులు పాఠశాల బ్రేక్ టైంలో జాతీయ రహదారి పైకి వచ్చి మల విసర్జన చేయడం విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారినది ప్రభాత వార్త విద్యార్థులను పలకరించగా నూతనంగా నిర్మించినటువంటి భవనం వాటర్ లీకేజీ వలన మరుగుదొడ్లలోకి అనుమతించలేదని ప్రధానోపాధ్యాయులు బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయమన్నారని విద్యార్థులు చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసినది విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి దీనిపై సమీక్ష నిర్వహించి విద్యార్థులను జాతీయ రహదారిపై వెళ్లనికుండా విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు విచారణ వ్యక్తం చేశారు.



తలకోన గుడి అభివృద్ధికి సంబంధించి భూమిపూజ కార్యక్రమానికి టిటిడి ఎఈఓ వెంకయ్యచౌదరిని ఆహ్వానిస్తున్న తలకోన ఆలయ చైర్మన్ సోమనాథరెడ్డి, కూటమి నాయకులు




స్వాతంత్ర వేడుకలకు ఎస్వీయూ స్టేడియంను పరిశీలిస్తున్న తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఇతర అధికారులు



రేణిగుంట శ్రీగంగమ్మ తల్లి జాతర సందర్భంగా తిరుపతి తెలుగుదేశం పార్టీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

## కుప్పాన్ని మోడల్ మున్సిపాలిటీ చేయడమే లక్ష్యం

**- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పాన్ని మోడల్ మున్సిపాలిటీ చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకా ంత్ పేర్కొన్నారు. బుధవార ం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో ఐటిసి సంస్థ అధ్వర్యంలో ఏజిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో వెల్‌బీయింగ్ ఔట్‌ఆఫ్ వేస్ట్ (డబ్ల్యుఓడబ్ల్యు)కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. అందులో ఐటిసి సంస్థ సైతం కుప్పంలో భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. కుప్పం మున్సిపల్ అభివృద్ధికి దాదాపు 1200కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైన్లు, కేబుల్స్, పట్టణ సుందరీకరణ, నగరవనాలు (పార్కు)ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛ కుప్పం సాధనకు సహకరించాలని కోరారు. అనంతరం పిఇఎస్ వారు అందించిన చెత్త బాక్సులను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కడ సభ్యుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్య దు వైద్యం శాంతారాం, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, వేలు,నేతలు సత్యేంద్రశేఖర్, అల్లాబకష్, మణి, ఆర్ముగం, గనిఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధనలకు అపోలో యూనివర్సిటీ వేదిక

**- ఆర్ట్ ఆఫ్ రీసెర్చ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్**

చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:




ప్రతి యూనివర్సిటీకి పరిశోధనలు కీలక అంశమని, అపోలో యూనివర్సిటీ పరిశోధనలకు గట్టి మద్దతు ఇస్తూ అనేక వర్క్‌షాప్‌లు, సెమినార్ల ద్వారా విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తోందని అపోలో యూనిర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ పేర్కొన్నారు. అపోలో యూనివర్సిటీలో బుధవారం ది అపోలో యూనివర్సిటీ సైకాలజీ విభాగం, ఎఐఎంఎస్ఆర్ ఎథిక్స్ కమిటీ సంయుక్త అధ్వర్యంలో డిజైనింగ్ ఎ రీసెర్చ్ ప్రొటోకాల్ అండ్ సబ్మిటింగ్ ఫర్ ఎథికల్ అప్రూవల్ అనే రెండు రోజుల వర్క్‌షాప్ రెండు రోజులుగా జరుగుతోంది. ఈ వర్క్‌షాప్‌కు హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ మాట్లాడుతూ తమ పరిశోధన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు సాధించారని, పరిశోధనలో ఎథికల్ విలువలకు ఉన్నత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎఐఎంఎస్ఆర్ ఎథిక్స్ కమిటీకి ప్రభుత్వ గుర్తింపు వుందని, ప్రతి పరిశోధనను ఎథిక్స్ కమిటీ, సైటిఫిక్ కమిటీ సమగ్రంగా పరిశీలిస్తాయని ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు పరిశోధనల్లో మార్గనిర్దేశకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, రిసోర్స్ పర్సన్లు ఫార్మకాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సచిదానంద అడిగ, ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విజేత, కమ్యూనిటీ మెడిసన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పిజె దేవిక, సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.జయప్రియ, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్‌నాయుడు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజంకు కృషి చేయాలి

**- ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య దొరస్వామి**



కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త

మాదకద్రవ్య రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయా లని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.దొర స్వామి కోరారు. నషాముక్త్‌భారత్ అభయాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం వర్సిటీలో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా విసి మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను తెలుసుకుని ముందుకుసాగాలన్నారు. మత్తుకు అలవాటుపడితే జీవితాలు చిత్తవుతాయన్నారు. సిఆర్వో రాజశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల గురించి సమాచారం ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ డా॥ హరికృష్ణ, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పుంగనూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త

బసవ రాజ జూనియర్ కళాశాల నుండి గోకుల్ సర్కిల్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. భారత్ మాత కీ జై అంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు యం జగదీష్ రాజు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా వేడుకలలో ఆగస్టు 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగర వేసి దేశభక్తి చాటాలన్నారు. ముఖ్య అతిథిగా కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్ సిబ్బంది, బసవ రాజ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, శుభారాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు, రిటైర్డ్ ఆర్మీ సంఘ సభ్యులు, బీజేపీ నాయకులు మల్లికా రాణి, అరవ పల్లి వెంకటరెడ్డి, పెద్దమఠం బాబు, టీవీఎస్ ప్రసాద్, మణి మొదలియార్, విజయ్ శంకర్, చంద్ర శేఖర్ రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెప

**- సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా**

చిత్తూరుహెల్త్, ఆగస్టు 13 ప్రభాతవార్త:



స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీ ప్రతి ఇంటిపై జాతీయ పతాకంను ఎగురవేయాలని సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడి పిలుపు మేరకు చిత్తూరు నగరంలో సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా బుధవారం ఇంటింటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడి పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయదానికి చిత్తూరు నగరంలోని మిట్టూరులో ఇంటింటికి జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, మస్తాన్, హేమంత్ చౌదరి, నాగరాజు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజు కొనసాగిన ఎన్‌ఎంయుఎ ఉద్యోగుల ధర్నా



కుప్పంరూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త

వివిధ సమస్యల పరిష్కారంకై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండోరోజు సైతం కుప్పం ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్‌ఎంయుఎ ఉద్యోగులు డిపో అధ్యక్షుడు మునస్వామి, కార్యదర్శి జయపాల్ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో అన్ని ఖాళీలు భర్తీ చేయడంతో పాటు పిఆర్‌సి కమీషన్‌ను తక్షణం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్ ప్రకటించాలన్నారు. విజయవాడలో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఓను రద్దు చేయాలన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ డిపో తరలింపు రద్దు చేయాలన్నారు. అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు రహంతుల్లా, రెడ్డికిషోర్, మునెప్ప, నవీన్, దిలీప్, జయశ ంకర్, అరుణ్, బాలకృష్ణ, నాయక్, రాజా, ఎల్లుస్వామి, మోహన్‌కుమార్, నాయక్ పాల్గొన్నారు.

## తమిళనాడు ఆర్టీసీని ఢీకొన్న కోళ్ల టెంపో

**.. డ్రైవర్ మృతి**



కుప్పంరూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త

కుప్పం - కృష్ణగిరి జాతీయ రహ దారిలో నడిమూరు సమీపంలోని ఘాట్ రోడ్డులో బుధవారం తమిళనాడు ఆర్టీసీని ఓ కోళ్ల టెంపో ఢీకొన్న సంఘటనలో టెంపో డ్రైవర్ మృతి చెందాడు. ఈ స ంఘటనకు సంబంధించి అర్బన్ ఎస్సై బాబు తెలిపిన మేరకు వివరా లిలా.. తమిళనాడు రాష్ట్రం కృష్ణ గిరి జిల్లా విట్టియం పట్టికి చెందిన మునిరాజ్ (27), రమేష్ (27)లు కోళ్లటెంపోలో కుప్పం నుంచి కృష్ణగిరి వెళ్తున్నారు. మార్గమధ్యంలో తమిళనాడు ఆర్టీసీ బస్సును టెంపో ఢీకొంది. దీంతో డ్రైవర్ ముని రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ రమేష్‌ను చికిత్స నిమిత్తం కృష్ణగిరి ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శింగిరిగుంట దారులు చూడతరమా...!

చౌడేపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త


అధ్వాన్నంగా వున్న శింగిరిగుంట రహదార్లు

ఆ గ్రామంలో చినుకు పడితే పలు చోట్ల రోడ్లన్నీ చిత్తడే... ఊరిచుట్టూ సైతం అదే పరిస్థితి నెలకొనింది. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటలో ఈ దుస్థితి వుంది. వర్షం కురిస్తే పలు చోట్ల రోడ్లపైనే నీరు నిలచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతు న్నారు. వీటితోపాటు శింగిరి గుంట-నూనెముద్దనపల్లికి వెళ్ళే మార్గంలో గంగమ్మ ఆలయానికి సమీపంలోగల రోడ్డు చెరువును తలపిస్తోంది. శింగిరిగుంట నుంచి రైతులు పొలాలకు వెళ్ళాలంటే అదే మార్గం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారుల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన



కల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీ దక్షిణ కాశీశ్వర సహిత వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో బుధవారం ఉదయం గంగా పూజ, గణపతి ప్రార్థన, కలసస్థాపన, మృత్యుంజయ హోమం, నిర్వహించి పూర్ణాహుతి మహా మంగళహారతి భావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్న ప్రసాద వితరణ జరిపారు.

## ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ పుష్పపల్లకి



కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త

స్థానిక రామచంద్రారోడ్‌లో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ పుష్పపల్లకి ఉత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిలో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగించారు. అంతకుముందు ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రా ంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, ఆలయ కమిటీ చైర్మన్ హర్ష ధర్మతేజ, న్యాయవాది అమరనాథ్, నేతలు మంజు, ఆర్‌ఆర్ రవి, నాను, శ్యాంసుందర్, గణేష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్థసారథినాయుడుకు ఉత్తమ పురస్కారం

చిత్తూరురూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త:



సామాజిక సేవలో విశేష కృషి చేసిన పి. పార్థసారథినాయుడు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పురస్కారానికి ఎంపికైనట్లు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరుకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. ఆగస్టు 15వ తేదీ అమరావతి నందు జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతుల మీదుగా అత్యున్నత పురస్కారం అందుకోనున్నారు. కాగా ఉత్తమ పురస్కారంకు ఎంపికైన పార్థసారథినాయుడుకు పట్టణంలోని పార్టీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు తదితరులు అభినందనలు తెలిపారు.

## కన్నుల పండువగా మరుదు పాండ్యుల విగ్రహావిష్కరణ

చిత్తూరురూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త:

భారతదేశపు తొలి స్వాతంత్ర్యపోరాట వీరులు మరుదు పాండ్య సోదరుల విగ్రహ ఆవిష్కరణ బుధవారం రాష్ట్ర మొదలియార్ సంఘ నాయకులు బుల్లెట్ సురేష్ అతిరథ మహారథుల చేతుల మీదుగా కన్నుల పండుగా గావించారు. చిత్తూరుపట్టణం, గంగినేని చెరువు సమీపంలో ఏర్పాటుచేసిన పెరియ మరుదు, చిన్న మరుదు పాండ్య సోదరుల విగ్రహాలను ముఖ్యఅతిధులుగా విచ్చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మొదలియార్ సంఘనాయకులు ఎసి షణ్ముగం, ఐఎంపిఎ పౌండర్ అరుణాచలం చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి వారిని ఘనంగా దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వం చేతుల్లో మొదటి హత్యాకాండకు గురైన మరుదు సోదరులు మా మొదలియార్ల గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోయారనీ, అంతటి మహనీయుల విగ్రహాలను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో పాటు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ సిఎంటీ త్యాగరాజులు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నళినీ యువనాయకుడు బుల్లెట్ అప్పు. మాజీ మున్సిపల్ చైర్మెన్ భాస్కర్, కార్పొరేటర్లు అలీ, రాయల్‌కుట్టి, మురళీక్రిష్ణ, గణేష్‌మేస్త్రీ, శ్రీకాంత్, మదురై సెల్వం, మొదలియార్ సంఘ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# క్రీడల్లో దివ్యాంగులలకు సహకారాలు అందిస్తాం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త : దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. దివ్యాంగుల ఆటలు పోటీల్లో జాతీయస్థాయి పోటీల్లో ఈజిప్టో పాల్గొననున్న బాలాయపల్లి మండలం జార్లపాడు గ్రామానికి చెందిన ముప్పాళ్ళ శేషుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ 20,000 రూపాయల నగదు అందజేశారు. దివ్యాంగుల ఆటలు పోటీల్లో విజేతలైన వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అంధులైన ముప్పాళ్ళ శేష సెప్టెంబర్ నెలలో ఈజిప్ట్‌లో జరిగే ఆటలు పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న సందర్భంగా ఆయనకు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ద్వారా 1,60,000 చెక్కును ఎమ్మెల్యే ఆయనకు అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ కూడా దాతల ద్వారా లక్ష రూపాయలను ఇచ్చారని చెప్పారు. తన వంతుగా 20000 రూపాయలను ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు మాట్లాడుతూ ముప్పాళ్ళ శేషు ఈజిప్టో సెప్టెంబర్ నెల ఒకటో తేదీ నుండి పదో తేదీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. తమ సంస్థ ద్వారా 1,60,000 శేషుకు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, టిడిపి నాయకులు ఆనంద్, మురళి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాసుల అందర్నీ అక్షరాసులుగా మార్చాలి :ఏపీఎం



బాలాయపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త : నిరక్షరాసుల అందర్నీ అక్షరాసులుగా చేయాలని వెలుగు ఏపిఎం వై కిరణ్ కోరారు. బాలాయపల్లి మండల సమైక్య కార్యాలయంలో అక్షరాంధ్ర ఉల్లాస్ కార్యక్రమంపై విలేజ్ గ్రామ సంగ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నిరక్షరాసులందరిని సర్వే చేసి వారికి అనువైన సమయాలు ఒక చోట చేర్చి చదువు నేర్పించాలని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, గిరిజనులు విద్యను నేర్చుకోవాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు.సమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్లురమేష్,శేషులు పాల్గొన్నారు

## సమిత్వ రీసెర్వేపై సమీక్ష సమావేశం



వాకాడు, ఆగస్టు 13 ప్రభాతవార్త: వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని బుధవారం డిఎల్‌డిఓ వాణిరెడ్డి ఆధ్వర్యంలో సమ్మిత్వ రీ సర్వేపై సమీక్ష కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు గ్రామ నత్తం, ఇంటి కొలతలు, ప్రభుత్వ ఆస్తులు, రీ సర్వే కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని కొండూరు, మొలగనూరు, రెడ్డిపాలెం బిట్ 1, బిట్ 2, ఇసక నట్టు గ్రామాలలో సమిత్వ రీ సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ట్రైనింగ్ అసిస్టెంట్స్ సుమన్ రెడ్డి, మనోజ డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నాచు మొక్కల పెంపకంపై శిక్షణ తరగతులు



వాకాడు, ఆగస్టు 13 ప్రభాతవార్త : మండలంలోని కొండూరు పాలెం గ్రామంలోని బుధవారం మత్స్యకార మహిళలకు సముద్రపు నాచు మొక్కలు పెంపకం పై ఆచరణాత్మక శిక్షణ తరగతులు ఎఫ్‌డిఓ రెడ్డినాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎఫ్ఓ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు జీవనోపాధి పెంపొందించుటకై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సముద్రంలో నాచు మొక్కల పెంపకం పై పలు సూచనలు సలహాలు అందజేశారు. మత్స్యకారు కుటుంబాలు జూనోపాధి మెరుగుపరుచుకొన్ని అభివృద్ధి చెందాలని ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎఫ్‌డిఓ రెడ్డినాయక్ మాట్లాడుతూ మండలంలోని కొండూరు పాలెం, అంజలాపురం గ్రామంలోని సముద్ర తీర ప్రాంతమైన పులికాట్ లేక్, నేలపట్టు, వన్యప్రాణి విభాగం చుట్టుప్రక్కల తీర ప్రాంత భూభాగము నందు పైలెట్ ప్రాజెక్టు కింద సిఎస్ఎఫ్ఓఆర్ఐ మరియు సీఎం ఎఫ్ ఆర్ఐ కేంద్ర సంస్థల ద్వారా గుర్తించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు హరీష్ నాయుడు, మహేంద్ర, దయాకర్ డిస్టిక్ కో ఆర్డినేటర్ అసోసియేషన్ డాక్టర్ ఎన్ జస్వంత్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రసన్న, సొసైటీ ప్రెసిడెంట్ అంకయ్య, కాపు రామయ్య, డిఆర్‌డిఏ డిపిఎం వెంకటేశ్వర్లు, స్కంద మెరైన్ రవి, విలేజ్ ఫిషరీస్ సిబ్బంది, సాగర్ మిత్రాలు తదితరులు ఉన్నారు.

## రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే




నాయుడుపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త : రాష్ట్రంలో రైతులను అభి వృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఆమె ఆధ్వర్యంలో బుధవారం నాయుడుపేట పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద సూపర్‌సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా రైతు సంబరసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం మాట్లడుతూ రాష్ట్రం ఆర్థిక సంకోభంలో ఉన్నప్పటికి పరిపాలన దక్షిత గల రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ మారే ్కట్ కార్యాలయం వరకు ట్రాక్టర్లుతో అన్నదాతలు భారీర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూళ్ళూరుపేట, నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చెర్మెన్ ఆకుతోట రమేష్, ఉయ్యాల ప్రవీణ్, టిడిపి జిల్లాఅధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి చెంద్రారెడ్డి, సంచి క్రిష్ణయ్య, విజయకుమార్‌నాయుడు, కట్టావెంకటరమణారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగర వేయాలి : కమిషనర్




నాయుడుపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల ఆదేశాల మెరకు స్వతంత్ర దినోత్సంను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వార ప్రతిఒక్కరు వారి ఇంటిపై తప్పనిసరిగా జాతీయ జెండాను ఎగరవేయాలని మున్సిపాల్టీ కమిషనర్ పజులుల్లా తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం అధికారులు పట్టణంలోని గాంధీపార్కు నుండి బజారు వీధులు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సచివాలయ, మెప్మా, మున్సిపాల్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్ ఒకరికి గాయాలు



పెళ్లకూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త : మండలంలోని పెన్నేపల్లి వద్ద గల స్వర్ణముఖి టవర్స్ దగ్గర నాయుడుపేట నుండి సర్వీస్ రోడ్డు మీదుగా శిరసానంబేడు వైపు వస్తున్న ట్రాక్టర్ పెన్నేపల్లి క్రాస్ వద్ద శ్రీకాళహస్తి వైపు మలుపు తిరుగుతున్న యాక్టివా స్కూటర్ను ఢీకొంది ఈ ఘటనలో స్కూటర్ పై ఉన్న కందుకూరి నాగసతీష్‌కు కుడి కాలుకు గాయం కాగా అంబులెన్స్ సిబ్బంది అతనిని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెళ్లకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు డివిజన్

## వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం



పెళ్లకూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త : మండలంలో స్థానికంగా పెళ్లకూరు గ్రామంలో వెల సియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవములు మూడు రోజుల నుండి జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు అయినా బుధవారం శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవమును అత్యంత వైభవంగా జరిపించారు. ఈ ఆలయం విశిష్టత గురించి తెలిసిన గ్రామస్తులు చాగణం లలితమ్మ భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత చాగణంగౌరీశంకర్ దాతృత్వంతో నూతన ఆలయమును నిర్మించుకున్నారు. ఈ బ్రహ్మోత్సవము లలో చివరి రోజైనా బుధవారం నాడు స్వామి వారి కళ్యాణ ఉత్సవములను శ్రీ చాగ్గణ గౌరీ శంకర్ ఆయన సతీమణి వరలక్ష్మిమి దంపతులు పాల్గొని అత్యంత వైభవంగా జరిపించారు. ఈ కళ్యాణోత్స వంలో రాయసం ఋషికేశవరావు రాయసం శ్రీలక్ష్మీ దంపతులు, గ్రామస్తులందరూ కలిసి పాల్గొనారు.

## రుణ విమోచన కృష్ణ మందిర విగ్రహ ప్రతిష్ట



చిల్లకూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త : మండల పరిధిలో నూతనంగా నిర్మించిన రుణ వియోచన కృష్ణ మందిరం సంప్రోక్ష మహోత్సవం ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణాన్ని తూర్పు కనుపూరు గ్రామాలో బేరిశెట్టి కులానికి మిద్దె నాగయ్య, శ్రీదేవిల కుమారుడు యశ్వంత్ నిర్మించిన ఆలయాన్ని అర్చకులు గణపతి పూజ, కృష్ణ మూలమంత్ర హోమం మహాపూర్ణాహుతి, మూలమూర్తికి విశేష అభిషేకము కలశ సంప్రోక్షణ అష్టోత్తర శతనామ పూజ మంత్రపుష్పం నిర్వహించారు. స్వామి వారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు ముత్యాలమ్మ, ఆలయ మాజీ చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ కోలు కిరణ్ కుమార్ సాయి లక్ష్మి దంపతులు, ఎం. ప్రశాంతు భాగ్యశ్రీరంజిని దంపతులు, గుడి నిర్మాణానికి సహకరించిన బత్తల సుబ్రహ్మణ్యం, పర్వతాల ముత్యాలయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## కృష్ణ స్వామిని దర్శించుకున్న సామంచి



చిల్లకూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: మండల పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామంలో బేరి శెట్టి కులానికి చెందిన మిద్దెనాగయ్య శ్రీదేవి వారి కుటుంబ సభ్యులు నూతనంగా నిర్మించిన శ్రీరుణ విమోచన శ్రీ కృష్ణ మందిరంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాలి ప్రకాష్ నాయుడు, ఏ. కోలుకిరణ్ కుమార్, మిద్దె యశ్వంత్ గూడూరు మండల అధ్యక్షుడు దయాకర్, బిజెపి నాయకులు కోడిపోలయ్య, గట్టు మురళీకృష్ణ, ఆవుల అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ స్థాయిలో ఆటల పోటీలు



చిల్లకూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: మహాత్మా అకాడమీ వారి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ స్థాయిలో నిర్వహించిన వివిధ రకాల పోటీలలో బిఆర్ అంబేద్కర్ గురుకులం నుంచి 21 మంది విద్యార్థులకు అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందించారు. అంతే కాకుండా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి విద్యార్థి పి. అయ్యప్ప చిత్రలేఖనం పోటీలలో మొదటి బహుమతి గెలుచుకోడంతో పాటు దేశ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. అనిల్ కుమార్, అకాడమి కాంపిటేషన్ ఇన్చార్జి టీచర్ హరికృష్ణ తెలిపారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల ఉపాధ్యాయులకు తిరుపతి, చిత్తూరు జిల్లా సమన్వాయాధికారి పద్మజ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## జాతీయ పురస్కారం అందుకున్న మయూరి శ్యామ్



గూడూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ (ఎన్‌డిసిఏ) వారు గూడూరుకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామ సుందర రావు (మయూరి శ్యామ్ యాదవ్)కు జాతీయ అవార్డు-2025 అందుకున్నారు. మయూరి శ్యామ్ యాదవ్ అనేక సామాజిక సేవ కార్యక్రమంలో చేయడంతో అది గుర్తించిన ఎన్‌డిసిఏ ఈ అవార్డు అందించారన్నారు. ఈసందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ జాతీయ స్థాయిలో అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఇచ్చిన ఎన్.డి.సి.ఏ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బింగి నరేంద్ర గౌడ్‌కి మయూరి శ్యామ్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రధానిపై అసత్య ఆరోపణలు తగదు



గూడూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అలాగే భారత ఎన్నికల కమిషన్ పై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ప్రధానమంత్రి మోడీ పాలనను చూసి ప్రపంచ దేశాలే మెచ్చుకుంటున్నాయని గౌడ్ సంఘం జాతీయ అధ్యక్షులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ సెక్రెటరీ శివ నాగేశ్వరరావు గౌడ్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికినే నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ప్రధానమంత్రిపై భారత ఎన్నికల కమిషన్ గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని దీని ఖండిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో మిరియాల వెంకటరామయ్య, శ్రీనివాసులు గౌడ్, మోహన్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో జెండా గేయం ఆవిష్కరణ



గూడూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను మొదటగా రూపొందించిన స్వర్గీయ పింగళి వెంకయ్యను స్మరించుకుంటూ తెలుగులో వ్రాయబడిన జెండా గేయాన్ని ఆవిష్కరించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్ ఇటీవల ఈ గేయాన్ని రాశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివప్రసాద్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం మన కళాశాల తరపున విభిన్నంగా జరపడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎన్‌సిసి కోఆర్డినేటర్ మైమూన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణ రాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ గోవిందు సురేంద్ర, భీమవరపు లక్ష్మి, డాక్టర్ కోటేశ్వరరావు, శ్రీధర శర్మ, కిరణ్మయి, డాక్టర్ ఝాన్సీ వాణి, కృపా కరుణ వాణి, రవి రాజు, గౌతమ్, శ్రీనివాసులు, సుందరమ్మ, గోపాల్, జనార్దన్, శైలజ, స్వరూప్, శంకర్, శ్రీలత, భాష, వినయ్ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జీలగల కోసం అన్నదాతల ఎదురుచూపులు

### -మరో నాలుగు రోజులు ఓపిక పట్టాలి: వ్యవసాయాధికారి



తొట్టంబేడు, ఆగస్టు 13 ప్రభాతవార్త : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో ఇవ్వలేని దుస్థితి చోటు చేసుకుంది. ముఖ్యంగా రైతుల కోసం రైతు పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఎపిసీడ్స్ పని తీరు తీసికట్టుగా మారింది. ఈ సంస్థ అందించే వంగడాలే కాదు కదా ప్రభుత్వం అందించే ఎరువులు కూడా సక్రమంగా సకాలంలో అందివ్వలేని దుస్థితి చోటు చేసుకుంది. వర్షాలు కురుస్తున్నాయి. వ్యవసాయ దివ్యక్షేత్రంగా ఉన్న శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అన్నదాతలు వ్యవసాయానికి సమాయత్తమౌతున్నారు. అయితే వ్యవసాయానికి ముందస్తు ఉపయోగించే భూమి సత్తా కోసం వాడే ఎరువులు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితి చోటు చేసుకుంది.

**సమయం పడుతుందంటున్న అధికారులు:**

వ్యవసాయ భూములకు సత్తా కల్పించుటకు పూర్వ ఎన్నో పద్దతులు ఉపయోగించేవారు. అయితే నేడు కూలీల కొరతతో భూములకు సత్తా కల్పించుటకు 'జీలగలు చల్లటం' ఆనవాయితి. ఎకరాకు పది కిలోలు చల్లటం 45రోజుల తరువాత ఆ పంటను దున్నటం జరుగుతుంది. దీని వల్ల భూములకు సత్తా కల్గుతుంది. అలాగే జనుము, పిల్లి పెసర్లు ఇచ్చే వారు. ప్రస్తుతం అవి కూడా ఇవ్వటం లేదు. దాంతో రైతులు భూ సత్తా కోసం ఎరువుల దుకాణం దారుల సలహా పాటించాల్సి ఉంది. రైతులకు అవసరమైన జీలగలు, నవధాన్యాలు, పిల్లి పెసర్లు, జనుములు ప్రభుత్వం ఎపి సీడ్స్ నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తుంది. అయితే ఇది వర్షాలకు ముందు నిల్వ చేసుకోవాల్సి ఉంది. 15 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి, అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమౌతున్నారు. కానీ వారికి అవసరమైన జీలగలు అందుబాటులో లేదని వాపోతున్నారు. ఎన్ని సార్లు తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సీజన్‌లో ంరైతులు సుమారు 30వేల ఎకరాల్లో వ్యవసాయ పనులు సాగిస్తున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేనందువల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సోమవారం ఇస్తాం: వ్యవసాయాధికారి**

శ్రీకాళహస్తిలోని రైతుల ఆరోపణలు, ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి ప్రభాతవార్త వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిని వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు. జీలగలు ఎపిసీడ్స్ ద్వారా రైతుభరోసా కేంద్రాలకు పంపుతారని వారు రైతులకు అవసరమైన మేరకు అందిస్తారని వివరణ ఇచ్చారు. అయితే ప్రస్తుతం జీలగలు 920క్వింటాళ్ళు అందుబాటులో పెట్టినట్లు ఎపిసీడ్స్ అధికారులు వివరించారన్నారు. ఇంకా 1005క్వింటాళ్ళు రావాల్సి ఉందని ఈ మేరకు ప్రతిపాదనలు పంపామని సోమవారం స్టాక్‌వ స్తుందని వివరించారన్నారు. సోమవారానికి రైతులకు అందించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 1920 క్వింటాళ్ళు నవధాన్యాలు అందుబాటులో పెట్టామని తెలిపారు. జనుము, పిల్లి పెసర్లు అందుబాటులో లేదని సీడ్స్ కార్పొరేషన్ వారు వివరించారని రమేష్‌రెడ్డి తెలిపారు.

# వైభవంగా శ్రీ గంగమ్మ తల్లి జాతర

### -అమ్మవారి ప్రతిమను జల్దిలో కలపడంతో ముగిసిన జాతర



రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త: అమ్మలు గన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఎంతో పెద్దమ్మ... శ్రీ రేణిగుంట గంగమ్మ తల్లి జాతర మూడో రోజు బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున ఆలయ నిర్వాహకులు, వంశపార్యంపర్య ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, విఆర్ రావణన్, సదాశివరెడ్డి, ఉమేష్ ముదిరాజ్ , ఎంజిరెడ్డి తదితరులు అమ్మవారి విశ్వరూప ప్రతిమను రేణిగుంట నడివీధి గంగమ్మ శూలం వద్ద ప్రతిష్టించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం వద్ద మూలవిరాట్టుకు విశేషమైన పూజలు అలంకరణలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీగంగమ్మ శూలం దగ్గర ప్రతిష్టించిన అమ్మవారి విశ్వరూపాన్ని అనేక ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. రేణిగుంట పట్టణం శ్రీ అమ్మవారి భక్తజన సందోహంతో కిక్కిరిసి పోయింది. భక్తులకు అమ్మవారిని దర్శించుకోవడానికి దాదాపు రెండు గంటల నుండి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు కలక్కుండా ఆలయ నిర్వ హకులు బ్యారికెట్లు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. జాతరలో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన మహాకుంభాన్ని సమర్పించారు. బస్టాండ్ సెంటర్లో ఏర్పాటుచేసిన బాణాసంచా వెలుగులు అబ్బురపరిచాయి. రంగులరాట్నాలు, కొలంబస్, జెయింట్ వీలు, రకరకాల దుకాణాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా కనులు విందు చేశాయి. కోలాటాలు, కేరళ వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, అమ్మవారి భక్తులు ప్రత్యేక వేషాలతో అభినయాలు వీనుల విందు కావించాయి. కుల మతాలకు అతీతంగా అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకుని తమ భక్తిని చాటుకున్నారు. రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. బుధవారం అర్ధరాత్రి అమ్మ ప్రతిమ జల్దిలో కలపడంతో జాతర తంతు ముగిసింది. జాతరను నిర్విఘ్నంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆలయ ధర్మకర్త, కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై నాగరాజు, ట్రైన్ ఎస్సై స్వాతి, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బంది ప్రత్యేక పోలీసు బలగాల ద్వారా డ్రోన్ కెమెరా సహాయంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఐతేపల్లి-ఏ.రంగంపేట రోడ్డు విస్తరణ షురూ : ఎంఎల్ఏ



చంద్రగిరి, ఆగస్టు 13 ప్రభాతవార్త: ఐతేపల్లి, కొటాల గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించి రూ.11.12 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక బుధవారం ఐతేపల్లి, కొటాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐతేపల్లి -ఏ.రంగంపేట రోడ్డు విస్తరణ (డబుల్ రోడ్డు) పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక ఐతేపల్లి సచివాలయం పరిధిలో మహిళలకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో టైలరింగ్‌పై ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 45 రోజుల్లో 36 మంది శిక్షణ పొందినట్లు వివరించిన ఆయన త్వరలోనే నైపుణ్య సర్టిఫికెట్స్‌తో పాటు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. మహిళలకు ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు తెలిపారు. రూ.120 కోట్లతో కళ్యాణీ డ్యామ్‌తో మండలంలోని చెరువులను అనుసంధానం చేస్తూ రైతులకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి ఇప్పటికే కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై అందించిన 180 స్వీకరించి, వాటి పరిష్కారం కొరకు ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు సమన్వయంతో అడ్డుకట్ట

చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించడానికి అవసరమైన పూర్తి సమాచారంను డిసిహెచ్ఎస్, డిఎంహెచ్ఓలు కలిసి సిద్ధం చేయాలని ఆదేశించారు.

## ఎటిఎంలో సొమ్ము తస్కరించిన మహిళ!



తొట్టంబేడు, ఆగస్టు 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఓ ఎటిఎంలో సొమ్ము డ్రాకు సంబంధించి స్వైప్ చేయటం సొమ్ములు రాకపోవటంతో వారు తొందరలో వెళ్ళటం వారు వెళ్ళిన తరువాత సొమ్ములు రావటంతో అక్కడే ఉన్న మరోమహిళకు లాభం చేకూర్చుంది. టౌన్ సిఐ డి.గోపి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 21వ తేది శ్రీకాళహస్తిలోని పానగల్ స్కిట్ బ్రాంచి ఎటిఎం నందు సొమ్ములు జమ చేయటానికి వచ్చారు. వారు రూ.39వేలు జమ చేసారు. కానీ టెక్నికల్ సమస్య అని పేర్కొనింది. వారు తొందలో వెళ్ళారు. అయితే వెనుకను వేచి ఉన్న మహిళ లోపలకు రాగా ముందు డిపాజిట్ చేసినవారి సొమ్ములు రూ.39వేలు వెనక్కు వచ్చాయి, అక్కడే ఉన్న మహిళ సొమ్ములు తీసుకొని వెళ్ళింది. తరువవాత డిపాజిట్ చేసిన వారికి సమాచారం రావటంతో తిరిగి రావటంతో అప్పటికే అంతా ఐపోయింది. సొమ్ములు తీసుకున్న మహిళ పలాయనం చిత్తగించింది. దాంతో బాధితులు వన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేసారు. ఆ మహిళ ఎవరికైనా తెలిస్తే తెలియజేయాలని సిఐ గోపి కోరారు.

## బోర్డుస భ్యుడు భానుప్రకాశ్‌రెడ్డికి...ఛైర్మన్ పరామర్శ



తిరుపతి, ఆగస్టు 13ప్రభాతవార్త:టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు పరామర్శించారు. ఇటీవల భాను తల్లి అరుణమ్మ దివంగతురాలైంది. ఆయనను నేరుగా నాయుడు ఇంటికెళ్ళి భానుప్రకాశ్‌రెడ్డిని పరామర్శించి ఓదార్పునిచ్చారు. అతని తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్‌రెడ్డి కుమారుడు పృధ్వీరెడ్డిని ఛైర్మన్ పలకరించారు.

## ఘనంగా ప్రారంభమైన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

### - మూషిక వాహనం పై దర్శనమిచ్చిన శ్రీ గణాధిపతుడు

### - ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, ఆగస్టు 13, ప్రభాతవార్త : పాకాల మండలం ఉప్పర పల్లె పంచాయతీలోని ఊట్లవారిపల్లి సమీపాన ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి 77వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు బుధవారం రోజున ఘనంగా ప్రారంభంమైనవి. బ్రహ్మోత్సవాలలో భాగమైన మొదటి రోజున ఉభయ దారులచే అక్కగార్లపూజ, గణపతి పూజ, కంకణధారణ, పుణ్యావచనం, మత్స్య గ్రహణం, వాస్తు శాంతి, అంకురార్పణం, ధ్వజస్తంభ, కలశ స్థాపన హోమంతో ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా రాత్రి ఆదిదేవుడు సర్వవిఘ్నాధిపతి అయిన శ్రీ వినాయక స్వామివారు మూషిక వాహనంపై దర్శనమిస్తూ గ్రామ పుర వీధులలో భక్తులను ఆశీర్వదించారు. సదరు పుణ్యకార్యం ఆద్యంతం భక్తుల నీరాజనాల మధ్య వాహన సేవ కన్నుల విందుగా సాగింది. మూషిక వాహనం సేవలో చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.

## కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 13ప్రభాతవార్త: నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ (చెత్త, పేరుకుపోయిన మట్టి) తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్.ఐ.సి. రోడ్డు, ఆఫీసర్ క్లబ్, రామకృష్ణా పురం, హమీద్ నగర్, మంచినీళ్ల కుంట తదితర ప్రాంతాల్లో ప్రజా పిర్యాదులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువలు లీక్ అవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో గల కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగిస్తే మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఉదయం ముందుగా చెత్తకుప్పలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి మధు, డి.ఈ.లు మధు, శిల్ప, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.